జనవరి - ఫిబ్రవరి, 2009

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

దేవుడు మనలను గడచిన సంవత్సరము ఆయన కృపలో భద్రపరచి బాధలలో, కన్నీటిలో, వేదనలలో మనలను ఆయనయందలి విశ్వాసములో నిలిపి ఉంచారు. అందుకు మనము ఎంతో స్తుతి చెల్లించవలసిన వారమైయున్నాము. మనము సహింపగలిగినంత కంటె ఎక్కువ శోధనను మన జీవితములో రాకుండ కాపాడి, నూతన సంవత్సరములో ప్రవేశపెట్టారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనస్థితిలో నున్నప్పటికి, మనం పరిస్థితుల వైపు చూడక, వాటిని తన ఆధీనంలో నుంచుకున్న మన దేవుని వైపుకు చూస్తూ వర్ధిల్లవలసిన వారమై ఉన్నాము. ఇస్సాకు దినములలో కరువు వచ్చినప్పుడు, దేవుని మాట విన్నవాడై విత్తనము విత్తగా నూరంతలు ఫలాన్ని పొందాడు. బావులు తవ్వగా కరువులో నీటి ఊటలను దేవుడనుగ్రహించాడు. ఇస్సాకు దేవుడే మనం ఆరాధించే దేవుడు అనే సంగతి మరువవద్దు. ఈ నూతన సంవత్సరములో “పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు” అని మన పరిచర్యకు వాగ్దానము చేసిన దేవునికి స్తోత్రములు. 2009 వ సంవత్సరములో మన జీవితములో నూతన ఆలోచనా విధానములను కలిగి ముందుకు వెళ్ళవలెనని దేవునికి నా ప్రార్థనైయున్నది. నిజ క్రైస్తవ జీవితము ఎల్లప్పుడూ తన్ను తాను పరీక్షించుకుంటూ జీవితములో దేవునికి ఇష్టంలేని అనుభవములను మార్చుకుంటూ దేవుడు తెలియపర్చిన విషయములలో రాజీ పడకుండ జీవించడం ఎంతో ముఖ్యం. దేవుడు మనకు అనుగ్రహించిన విలువైన జీవితమును మనుష్యులకు మేలు చేయుటకు, ధైర్యపరచుటకు, ప్రేమించుటకు వ్యయపరచవలసిన వారమైయున్నాము.

రక్షించబడిన నాటి నుండి, గతించిన సంవత్సరములన్నిటిలో దేవుని విషయములలో రాజీపడక ముందుకి పోవాలనే ఆలోచన రాకుండ, ఎవరు ఉన్నా ఎవరు లేకున్నా “విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు వాడునైన యేసు వైపు చూచుచూ” పరుగు పందెంలో ఓపికతో పరుగెత్తాలనే అపేక్షను కలిగించిన దేవునికి స్తోత్రం. మీలో అనేకులు పరిచర్య పట్ల చూపించుచున్న ప్రేమ, ఆదరాభిమానములు ఎంతో ప్రోత్సాహమును కలిగిస్తున్నాయి. నిజముగా నా జీవితములో మీతో కలిసి దేవుని పని చేయుట నా ధన్యతగా భావిస్తున్నాను. అందునుబట్టి నా దేవునికి ఎల్లప్పుడూ కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. యౌవనస్థులైన సహోదర, సహోదరీలైన వారు వారి జీవితమును దేవుని కొరకు వ్యయపరుస్తూ, పెద్దలు ఎంతో బాధ్యతతో ఈ పరిచర్య తమదిగా భావించటం నాకెంతో ఆనందమును కలిగిస్తుంది. ఈ సంవత్సర కాలమంతా దేవుడు మిమ్ములను మీ కుటుంబములను ఆశీర్వదించును గాక! ఆమేన్!

జనవరి - ఫిబ్రవరి, 2009

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- తీర్మానం ఒక సోపానం ........ 2
- ఆశ - నిరాశ ........ 3
- హృదయములోని గుంట నక్కలు ........ 6
- దేవుడు చూచెను (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- సెల్ or హెల్ (యౌవనస్థుల భాగం) ........ 9
- సాధుసుందర్ సింగ్ జీవిత చరిత్ర - 2వ భాగము ........ 10
- ప్రేమ (బాలల శీర్షిక) ........ 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 13
- అపోహలు ........ 15
- ఇది తెలుసా? ........ 16
- బైబిల్ క్విజ్-2 ........ 17
- జన్మదిన శుభాకాంక్షలు ........ 19


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227



# తీర్మానం ఒక సోపానం


- బ్రదర్. శేఖర్

నూతన సంవత్సర తీర్మానములతో (new year's Resolutions), జీవితములో ఒక నూతనత్వమునకు నాంది పలకాలని మనము ఆశపడతాము. అయితే సాధారణముగా మొదటి నెలలోనే మనకి నిరాశ ఎదురవుతూ ఉంటుంది. మనము చేసుకున్న తీర్మానములను నిలబెట్టుకోలేని వారుగా మిగిలిన సంవత్సరమంతా గడిపేస్తాము. నూతన సంవత్సర తీర్మానములను నిలబెట్టుకోవడములో అత్యధికులు విఫలమవుచూ ఉంటారని ప్రపంచవ్యాప్తముగా సర్వేలు స్పష్టము చేస్తున్నాయి. మనము చేసే తీర్మానములు ఎందుకు విఫలమవుతాయి?

మనలో నిగ్రహ శక్తి (will power) లేక విఫలమవుతున్నామని సరిపెట్టుకుంటూ ఉంటాము. మనము చేసే మంచి తీర్మానములు సాధారణమైన మన జీవితములను అసాధారణముగానూ, శ్రేష్ఠమైనవిగానూ మలచగలిగే సోపానాలు. పరిశుద్ధ గ్రంథమైన బైబిలులో అనేక మంది సాధారణ వ్యక్తులు మంచి తీర్మానములను కలిగి జీవించుట ద్వారా అసాధారణమైన వ్యక్తులుగా వర్ధిల్లుట మనము చూడవచ్చు. అక్రమ సంబంధము అనే పాపమునకు ఒప్పుకొనక, దేవునికి వ్యతిరేకముగా పాపము చేయకూడదని తీర్మానించుకున్న యోసేపు అనే యువకుడు దేవుని చేత హెచ్చింపబడిన వాడై, ఈజిప్ట్ రాజ్యాధికారిగా ప్రమోషన్ పొందాడు. మానసికంగా, శారీరకంగా అక్రమ సంబంధములు అనే పాపపు ఉచ్చులో జీవిస్తున్న అనేక మందికి యోసేపు జీవితం ఎంతో ఆదర్శనీయం.

బబులోను దేశమునకు బానిసగా తీసుకు వెళ్ళబడిన దానియేలు అనే బాలుడు రాజ భోజనము తిని, ద్రాక్షారసమును త్రాగి తన్ను అపవిత్రపరచుకొనకూడదని తీర్మానము చేసుకొని దానిని నిలబెట్టుకొనుట ద్వారా దేవుని జ్ఞానమును పొంది బబులోను సంస్థానమంతటి మీద ప్రధానిగా చేయబడ్డాడు. దురలవాట్ల మత్తులో బ్రతుకుచున్న వారికి దానియేలు జీవితము ఒక గొప్ప సత్యమును బోధపరుస్తుంది. యోసేపు, దానియేలు తాము చేసిన తీర్మానములను తమ నిగ్రహశక్తితో కాక, దేవుని యొక్క శక్తితో నిలబెట్టుకోగలిగారు. వారి అనుదిన దైవ ధ్యానం వారి యొక్క విజయ రహస్యం.

నీవు, నేను చేసుకున్న వాక్యానుసారమైన ఏ తీర్మానమైనా మనము నిలబెట్టుకోగలము. అయితే మన పరిమితమైన నిగ్రహ శక్తితో కాక, యేసుక్రీస్తు యొక్క అపరిమితమైన పునరుత్థాన శక్తి ద్వారా మాత్రమే ఇది సాధ్యం అనే సత్యమును మనము గుర్తించవలసి ఉన్నది. ఎవడైనను క్రీస్తునందున్న ఎడల వాడు నూతన సృష్టి. అంటే క్రీస్తు మనలను దినదినమూ నూతనపరచాలని కోరుకుంటున్నాడు. దేవుని కోసము తీర్మానము లేకుండా జీవించే ఏ జీవితము కూడా దేవునిని సంతోషపెట్టేదిగా ఉండలేదు. ప్రియ చదువరీ ! గతములో నీవు ఎన్నో వైఫల్యాలను పొంది ఉండవచ్చు, కానీ 2009 వ సంవత్సరము దీవెనకరమైనదిగా దేవుడు మార్చగలడు. దేవునికి ఇష్టుడిగా జీవించాలనే తీర్మానము నీవు చేసుకుంటే నిన్ను నూతన సృష్టిగా మార్చి, నడిపించగలిగిన వాడు మన ప్రభువైన యేసుక్రీస్తు. ఆమెన్ !



# ఆశ-నిరాశ

- బ్రదర్ టి.ఎపఫ్రా

మానవుని జీవితములో ఆశ, నిరాశ అనే భావములు హృదయసంబంధమైనవి కానీ అవి జీవన విధానమును ఎంతో ప్రభావితం చేస్తాయి. మనము జీవించే విధానము మీదే మన భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. సృష్టికర్తయైన దేవుడు మనలను అనగా మనుష్యులను భూమి మీద జీవించినంత కాలము సంతోషముగాను, జీవిత యాత్ర ముగించబడిన తరువాత అనగా మరణము తరువాత యుగయుగములు జీవించే పరలోకరాజ్యములోనూ ఉండాలని కోరుకుంటున్నాడు.


కనుక ఆశ, నిరాశ అనే భావములు మన జీవితములో ఉద్దేశములను ప్రభావితం చేస్తాయి. ఆశ, నిరాశ అనే చిన్న పదములు జీవితములో పెద్ద వ్యత్యాసమును కలిగిస్తాయి. ఒక తండ్రికి ఇద్దరు కవల పిల్లలు, ఇద్దరి పోలికలు ఒకే విధముగా ఉండేవి. ఒకరోజు వారి పుట్టిన దినమున తండ్రి ఇద్దరికీ ఒకే విధమైన ఆట వస్తువులను బహుమానముగా తీసుకు వచ్చాడు. ఆ ఆట వస్తువులను తీసుకొని, వారి వారి గదులలోనికి వెళ్ళి పోయారు. తండ్రి పిల్లలను చూడడానికి వెళ్ళేసరికి, ఒకడు ఎంతో ఆనందంగా ఆ బొమ్మలతో ఆడుకుంటున్నాడు. రెండవ వాడు ఆ బొమ్మల దగ్గర కూర్చుని ఎంతో ఏడుస్తున్నాడు. వారి తండ్రి ఆ ఏడుస్తున్న వానిని , ఎందుకు ఏడుస్తున్నావు ? అని అడిగాడు. అందుకు ఆ పిల్లవాడు బొమ్మలతో ఆడుకుంటే, బ్యాటరీ అయిపోతుంది కదా అని ఏడుస్తున్నాను అని అన్నాడు. చూశారా ! ఒకే తండ్రి, ఒకే విధమైన బహుమానము, ఒకే వయస్సు, కానీ ఒకడు సంతోషముగా ఉన్నాడు, మరొకడు దుఃఖంగా ఉన్నాడు. కారణం వారి, వారి ఆలోచనా విధానము. మన ఆలోచనా విధానమే మన సంతోషమునకు లేక మన దుః ఖమునకు కారణము.

**బైబిలు గ్రంథములోని ఇశ్రాయేలు ప్రజలు గురించి మనము ధ్యానించినపుడు:-**

దేవుడు ఏర్పరచుకొనిన జనాంగము ఇశ్రాయేలు ప్రజలు. యాకోబుని ఇశ్రాయేలుగా మార్చి అతని 12 మంది కుమారులను, 12 గోత్రములుగా ఏర్పరచుట వలన వారు దేవుని ప్రజలుగా పిలువబడ్డారు. ఇశ్రాయేలు ప్రజలు పరదేశమైన ఐగుప్తుకి వెళ్ళినప్పుడు వారు మొత్తము 70 మంది. వారు దేవుని ప్రజలుగా ఉంటూ, దేవుని

ఆశీర్వాదములను పొందుకుంటూ, అభివృద్ధి చెందుచూ, విస్తరించబడుచూ ఉండగా ఆ దేశములోని రాజు వారిని వెట్టి చాకిరీ చేయించుచూ బానిసలుగా చేసెను. ఆ బానిసత్వమును బట్టి వారు దేవుని సన్నిధిలో మొఱ్ఱపెట్టగా, ఆ మొరను ఆయన ఆలకించి మోషే అను సేవకుని వారిని విడిపించుటకు నాయకునిగా ఏర్పరచెను. ఇశ్రాయేలు ప్రజలు మోషే నాయకత్వములో రాజైన ఫరో చేతి నుండి, ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించబడి వాగ్దాన దేశమును స్వతంత్రించు కొనునట్లుగా, బయలుదేరి వెళ్ళుచుండగా మొట్టమొదట ఎఱ్ఱసముద్రము అడ్డుగా వచ్చెను. నిర్గమ 14:21-23 ఆయన ఎఱ్ఱసముద్రమును రెండు పాయలు చేసెను. ఇశ్రాయేలు ప్రజలు సముద్రమును దాటి వెళ్ళిరి, శత్రుసైన్యము నీళ్ళలో మునిగిపోయెను. అప్పుడు వారు ఎంతగానో సంతోషించి, దేవుని సన్నిధిలో ఆయనను స్తుతించిరి. ఈ విధముగా వారియొక్క మార్గములలో దేవుడు పగలు మేఘస్థంభమును, రాత్రి అగ్ని స్థంభమును తోడుగా ఉంచి, నడిపించుచుండెను. అప్పుడు వారు ఆహారము, నీటి కొరకు నిరాశ కలిగిన మాటలు మాట్లాడు చున్నారు. (నిర్గమ 16:3) అప్పటికే వారు ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించబడి ఎఱ్ఱ సముద్రము పాయలుగా చేయబడుట చూసారు. కానీ చిన్న సమస్య రాగానే నిరాశతో నోటి మాట ద్వారా తిరిగి బానిసత్వమును కోరుకునే వారిగా ఉన్నారు. మేమక్కడ ఏల చావలేదు? అని పలుకుచున్నారు. వారి జీవితములో వారిని దేవుడు విడిపించి, తోడుగా ఉండి నడిపించిన విధానము మరచి చిన్న సమస్య కలిగిన వెంటనే నిరాశతోను, నిరుత్సాహముతోను మాట్లాడుచున్నారు.

దేవుడు మోషేతో మీరు వెళ్ళనైయున్న కానాను దేశమును చూచి వచ్చుటకు మనుష్యులను పంపమని చెప్పెను. సంఖ్యాకాండము 13:17,18,19 లో చెప్పిన విధముగా 12 మంది మనుష్యులు వెళ్ళి 40 దినములు ఆ దేశమును సంచరించి, చూచి తిరిగి వచ్చిరి. వారు వచ్చి తెలియపరిచినది ఏమనగా అది పాలు తేనెలు ప్రవహించు దేశము, ఆ దేశములో నివసించు జనులు బలవంతులు, వారి పట్టణములు ప్రాకారముగలవి, అవి మిక్కిలి గొప్పవి. సంఖ్యా 13: 27,28 అయితే వారిలో 10 మంది మాత్రము ఆ జనులు మన కంటే బలవంతులు. మనము వారి మీదికి పోజాలమనిరి. వారు తాము చూచిన ఆ దేశమును గూర్చి ఇశ్రాయేలు సర్వసమాజమంతటికి చెడ్డ సమాచారమును అందించిరి. ఆ దేశ



జనులందరు ఉన్నత దేహులు. మా దృష్టికి మేము మిడతలవలె ఉంటిమి, వారి దృష్టికిని అట్లే ఉంటిమనిరి. అప్పుడు వారందరూ ఎలుగెత్తి ఏడ్చి, మేము తిరిగి ఐగుప్తుకు వెళ్ళుట మాకు మేలు అని చెప్పిరి.

వీరిలో భవిష్యత్తును గురించి ఒక కల, ఆశ, నిరీక్షణ ఎంత మాత్రమూ లేవు. వీరు తమని తాము కించపరచుకుంటూ, తమ పరిస్థితిని తమతో పోల్చుకుంటూ, వారిని జయించలేమని, పరిస్థితులు చాలా కష్టమైనవని భావించుకున్నారు. వారిలో ఇద్దరు (యెహోషువ, కాలేబు) మాత్రము జనులను నిమ్మళపరిచి, మనము నిశ్చయముగా వెళ్లుదుము దాని స్వాధీనపరచుకొందుము, దాని జయించుటకు మన శక్తి చాలుననెను (సంఖ్యా14:30) వీరు పరిస్థితులను దేవునితో, దేవుని కార్యములతో పోల్చి నిరీక్షణతో ఆ దేశమును మనము స్వతంత్రించు కొనగలమని చెప్పుచున్నారు. ఆశ కలిగిన మాటలనే మాట్లాడుచున్నారు. పూర్ణహృదయముతో, నిండు మనస్సుతో దేవుని యందు దృష్టిని నిలుపుచున్నారు. వీరి హృదయము దేవుడు చేసిన ఆశ్చర్యకార్యములతో నిండి ఉన్నది కనుక నోటి నుండి నిరాశ కలిగిన మాటలు మాట్లాడక జయించగలము అనే ఆశను కలిగి ఉండటం ద్వారా వాగ్దాన దేశమైన కానానును స్వాధీనపరచుకున్నారు.

ప్రియమైన వారలారా! ఈ దినములలో మనము మనలను, మన పరిస్థితులను పోల్చుకుంటాము. నా సంపాదన ఎంత? నా సంపాదనను బట్టి నా పిల్లల భవిష్యత్తును ఏ విధముగా తీర్చిదిద్దగలను? అనే ఆలోచనలతో సతమతమవుతూ ఉంటాము. ఇవి చాలా భారముగా కనిపించి నిరాశను కలిగిస్తాయి, అప్పుడు ఆత్మ విశ్వాసమును కోల్పోతాము. నిరాశ అవిశ్వాసమును, విసుగును కలుగజేసి, జీవితములో కృంగిపోయేలా చేసి దేవుని దృష్టికి అపరాధులుగా మారుస్తుంది. చిన్న సమస్యకి, శోధనకి, మన పరిస్థితులకు భయపడక, అనేక కార్యములను జరిగించిన దేవుని మీద ఆధారపడుచూ, నిరాశ కలిగిన మాటలుకాక, ఆశ, నిరీక్షణ కలిగి జీవించుట ద్వారా దేవుని రాజ్యమును స్వతంత్రించుకునే వారముగా ఉంటాము.


రండి! పాల్గొనండి!! ప్రార్థించండి!!!

**జనవరి 26వ తేది ప్రత్యేక ఉపవాస ప్రార్థన**

**సమయం:** ఉదయం గం. 9.00 లకు

**స్థలము:** బాలాజీ ఫంక్షన్ హాల్, N.H. 9, హయత్‌నగర్,హైదరాబాద్.

వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628

# హృదయములోని గుంట నక్కలు



మన ద్రాక్షతోటలు
పూతపట్టి యున్నవి
ద్రాక్షతోటలను చెరుపు
నక్కలను పట్టుకొనుడి
సహాయము చేసి గుంట
నక్కలను పట్టుకొనుడి
–పరమగీతము 2:15

ఫలించవలసిన ఆత్మీయ జీవితమును పాడు చేయు పాపములు:-

| | |
|---|---|
| 1. విగ్రహారాధన | - నిర్గమ **20:2-5, 1** యోహాను **5:21** |
| 2. లోకాశలు | - యాకోబు **4:4, 1** యోహాను **2:16** |
| 3. కొండెములుచెప్పుట | - లేవీ **19:16, 1** తిమోతి **3:11** |
| 4. విచారము | - మత్తయి **6:27,31,** సామె **12:25** |
| 5. సోమరితనము | - మత్తయి **25:26** |
| 7. వేషధారణ | - మత్తయి **6:5** |
| 8. బుద్ధిహీనత | - కీర్తన **14:1,** ప్రసంగి **10:14** |
| 9. హెచ్చించుకొనుట | - యెషయా **14:12-14** |
| 10.మోహము | - మత్తయి **5:28** |
| 11. స్వార్థము | - **2** తిమోతి **3:1,2** |
| 12. పగ | - లేవీకాండము **19:17** |
| 13. అసూయ | - గలతీ **5:21** |
| 14. కోపము | - ప్రసంగి **7:9,** సామె **14:17** |



# " దేవుడు చూచెను"

- సిస్టర్ వి. విజయ

**లేయా ద్వేషింపబడుట**
**యెహోవా చూచి**
**ఆమె గర్భము తెరిచెను.**
**– ఆదికాండము 29:31**

యాకోబు తన తండ్రి వద్ద నుండి జ్యేష్ఠత్వపు ఆశీర్వాదమును పొందుకొని, ఆ ఆశీర్వాదము పోగొట్టుకున్న అన్న చంపుతాడేమోనని భయపడి, తల్లి యొక్క సలహా మీద మేనమామ అయిన లాబాను వద్దకు పారిపోయి వచ్చాడు. లాబానుకి ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె – లేయా – జబ్బు కండ్లు గలది. చిన్న కుమార్తె –రాహేలు – రూపవతియు, సుందరియునై యుండెను. (ఆదికాండము 29:17) యాకోబు రాహేలుని చూచి ఇష్టపడి, ఆమెను వివాహము చేసుకోవాలని ఆశపడి, 7 సంవత్సరములు లాబానునకు కొలువు చేసెను. అయితే దినములు సంపూర్ణమైనపుడు లేయాని అతనికి ఇచ్చి వివాహము చేసెను.

**లేయా జీవితమును మనము పరిశీలించినపుడు:–**

**1. మనుష్యుల చేత ద్వేషింపబడింది:–** లేయా జీవితములో బాహ్యరూపమును బట్టి తండ్రియైన లాబానుకు ఆమె భారముగా అనిపించింది. యాకోబు మనసులో రాహేలు ఉన్నదని, ఆమె కోసమే అతను కొలువు చేస్తున్నాడని తెలిసి, లేయా మనసును గ్రహించకుండా యాకోబుకు ఇచ్చి వివాహము చేశాడు. వివాహము అయిన తరువాత లేయా యాకోబు చేత ద్వేషింపబడింది.

**2. కోపము, అసూయ లేని స్థితి:–** (ఆదికాండం 29:30) యాకోబు రాహేలుని ప్రేమించి, మరల 7 సంవత్సరములు లాబానుకు కొలువు చేసి, ఆమెను వివాహము చేసుకొనెను. చెల్లి అయిన రాహేలు, భర్త అయిన యాకోబు చేత ప్రేమించబడుట చూచిననూ, లేయా ఎంత మాత్రమూ కోపమును తెచ్చుకోలేదు. అదే విధంగా రాహేలు యొక్క సౌందర్యమును బట్టి అసూయని ఎంతమాత్రమూ కలిగిలేదు. తన స్థితిని బట్టి తనని తాను నిందించుకొనలేదు.

**3. యెహోవా ఆమెను చూచెను:–** యాకోబు లేయాను ద్వేషించుట యెహోవా చూచి ఆమె గర్భమును తెరిచెను. మనుష్యులు ఆమెను వదిలివేసి, పట్టించుకొనకుండా ఉన్ననూ యెహోవా ఆమె మనవిని లక్ష్యపెట్టారు. యెహోవా ఆమె పైరూపమును లక్ష్యపెట్టలేదు కానీ ఆమె హృదయమును లక్ష్యపెట్టారు.

**4. దేవుని స్తుతించే మనసును, నిరీక్షణను కలిగి ఉన్నది:-** యెహోవా ఆమెకు కుమారులను అనుగ్రహిస్తున్న ప్రతీ సమయములోనూ, ప్రతీసారి దేవుడు నా మొర విన్నాడు, నా మనవిని ఆలకించాడు, నన్ను కరుణించాడు అనే కృతజ్ఞతా హృదయమును కలిగి, ఆయనను స్తుతించుచూ, ప్రతీసారి నా భర్త నన్ను ప్రేమిస్తాడు, ఈ సారి నన్ను హత్తుకుంటాడు అనే ఆశతోనూ, నిరీక్షణను మాత్రమే కలిగియున్నది.

మన జీవితంలో మనకంటే అందంగా ఉన్నవారిని, అభివృద్ధి చెందుతున్న వారిని,



ఆత్మీయంగా మనకంటే ముందుగా వెళ్ళుతున్నవారిని చూచి అసూయ పడకూడదు. మత్సరము ఎముకులకు కుళ్ళు అని సామెతలు 14:30 లో చెప్పబడింది. మన హృదయములో ఎవరిపైనా కోపము కలిగి ఉండకూడదు. నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు. (యాకోబు 1:20)

లేయా మనుష్యుల ప్రేమను పొందక, ద్వేషించబడిననూ ఆమె మనసు యెహోవాను హత్తుకొని, ఆయన మీద నిరీక్షణ కలిగి ఉండుట చేత, ఇశ్రాయేలు 12 గోత్ర కర్తలైన 12 మంది కుమారులలో 6గురు లేయా గర్భము నుండి పుట్టినవారే. అంత మాత్రమే కాక, యేసుక్రీస్తు శరీరధారియైన శిశువుగా యూదా అను గోత్రము ద్వారా భూమి మీద జన్మించాడు. ఈ యూదా లేయా గర్భమున పుట్టిన కుమారుడే. ఆహా! మనుష్యులు ద్వేషించిన లేయా యొక్క హృదయమును చూచిన దేవుడు ఎంత గొప్ప ధన్యతను ఆమెకు అనుగ్రహించారు. అంతే కాక ఆమె దినములన్నియూ క్షేమముగా ఉంచి నెమ్మదిగా సమాధిలోనికి దిగునట్లుగా దేవుడు చేశారు. లేయా మరణము తరువాత ఆమె పితరులైన అబ్రాహాము, ఇస్సాకుల సమాధి ప్రక్కన సమాధి చేయబడింది.

కావున ప్రియ సహోదరీ! కుటుంబములోని భర్త, బంధువుల చేత ద్వేషించబడుచున్ననూ, మన చుట్టూ ఉన్న పరిస్థితులను బట్టి నిరీక్షణకు ఆధారమే కనిపించకపోయిననూ, ప్రతి స్థితిని బట్టి దేవునిని స్తుతించుచూ, మేలు చేయు దేవునివైపు చూస్తూ ముందుకు కొనసాగుదాం. ఈ విధముగా జీవించిన లేయా జీవితమును ఆశీర్వదించిన దేవుడు నిశ్చయముగా మన జీవితములను ఆశీర్వదించి ఆయన కృపతో నడిపిస్తారు.

దేవుడు మనకు తోడైయుండును గాక!

# సెల్ OR హెల్



సాంకేతిక విప్లవం ప్రపంచంలో పరవళ్ళు త్రొక్కుతున్న ఈ దినములలో ఎక్కడ చూచిననూ సెల్‌ఫోన్‌లే. ఫోన్ లేకపోవటము అవమానముగా భావిస్తూ, కొందరు ఏ క్రొత్త మోడల్ కనిపిస్తే, ఆ ఫోన్ కొనటానికి ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. అంతా కలసి ఇదొక పెద్ద వ్యాపార విషయముగా మారిపోయింది. వార్తాపత్రికలలో చూచినను, టీ.వి ఛానల్స్‌లో చూచిననూ మరియు రోడ్ల మీద, బస్టాండ్‌లలో, రైల్వేస్టేషన్‌లలో, ఎయిర్ పోర్టులలో ఉండే హోర్డింగ్స్‌ని చూచినా సెల్‌ఫోన్ ప్రకటనలే. మానవుని జీవితములో సెల్‌ఫోన్ తెచ్చిన విప్లవము, ఆర్థిక, సామాజిక కోణములలో ఎంతో ముందడుగు అని చెప్పటములో అతి శయోక్తి కాదు. ఇది నాణెమునకు ఒక ప్రక్క విషయమైతే మరొక ప్రక్కన మానసిక సంఘర్షణ, నైతిక విలువల పతనం కనబడుతుంది. మన జీవితములో సెల్‌ఫోన్ ఎలాంటి పాత్రను పోషిస్తుంది ? దేవుని మందిరములలో, ప్రార్థనా స్థలములలో సెల్‌ఫోన్ తన ప్రతాపం చూపిస్తుంది. దాని ధాటికి బాలురు, యౌవనులు, పెద్దలు ఎంతగానో ప్రభావితం అవుతున్నారు. కొందరు విశ్వాసులు, సేవకులు ప్రార్థనా అవసరతల కొరకు ఫోన్ అని చెప్పుకుంటూ, కొద్ది సమయం కూడా మనసుని దేవునిపై లగ్నం చేయలేక వాక్యం వింటున్నా, ప్రార్థన చేసుకుంటున్నా కాల్స్ మిస్ అవుతామేమో అన్న బాధ, ఆందోళనలకు గురవుచున్నారు.

ఈ మధ్య ఒక యౌవనస్తుడు ప్రతీ దినము 8 గంటలు అనవసరమైన కాల్స్ మాట్లాడతానని చెప్పటము సమస్య తీవ్రతకు అద్దం పడుతుంది. ఆత్మతో, సత్యముతో ఆరాధించవలసిన వారు నిర్జీవ స్థితిలోనికి వెళ్ళిపోవుచున్న సమయములు ఎంతో దుఃఖకరమైనవి. సెల్‌ఫోన్ విషయంలో స్పందించవలసిన దాని కంటే అతిగా స్పందించటం మనకు అలవాటుగా మారిపోయింది. విశ్వాస స్థానంలో అవిశ్వాసమును, ప్రేమ స్థానంలో ద్వేషమును సంపాదించుకొని, మనము దేవుని నుండి దూరపరచబడు చున్నాము. మనలో ప్రతి ఒక్కరమూ ఒక్కసారి ఆలోచించి మన స్థితి ఎలా ఉందో అర్థము చేసుకొని మన సమయమును దొంగిలిస్తూ, ఆత్మీయ జీవితమును పతనము చేస్తుంటే వాటిని సమర్థించుకోవటానికి ఏవేవో కారణములు వెదకవద్దు. అబద్దికులు దేవుని రాజ్యమునకు వారసులు కారు. ఒకడు లోకమంతయూ సంపాదించుకొని అతని ఆత్మను నరకము నుండి కాపాడుకోలేకపోతే వానికి ప్రయోజనమేమి? నీ సెల్‌ఫోన్ నీ ఆత్మను నరకమునకు సిద్ధపరుస్తూ ఉందేమో యోచించు.

ప్రియసహోదరీ, సహోదరుడా ! నీ సెల్‌ఫోన్ వలన నీకు ఎన్నో లాభములు ఉండవచ్చు కానీ నీ ఆత్మను నష్టపరిస్తే దాని వలన ఏమి ప్రయోజనము ? నీ చెయ్యి నిన్ను అభ్యంతరపరచిన ఎడల దానిని నరికివేయుము. నీవు రెండు చేతులు కలిగి నరకములోని ఆరని అగ్నిలోనికి పోవుటకంటె అంగహీనుడవై జీవములో ప్రవేశించుట మేలు అని మార్కు 9:43,44 లో వ్రాయబడి ఉన్నది కాబట్టి ప్రియ చదువరీ ! నీ సెల్‌ఫోన్ నీ జీవితమునకు అభ్యంతరకరంగా ఉన్న ఎడల దానిని ఇప్పుడే నీ యొద్ద నుండి తీసివేసి నీ ఆత్మను సంరక్షించుకో.... (ఇంకా ఉంది )

- ఎడిటర్



# సాధుసుందర్ సింగ్ జీవిత చరిత్ర

– సీరియల్ 2వ భాగము

సుందర్ తల్లి యధార్థపరురాలే గాక తెలివైనది. తన చిన్న కుమారుడైన సుందర్‌కి వీలైనంత ఎక్కువ ఆధ్యాత్మిక సహాయము లభించాలని కోరి, అతనికి నేర్పే ఉపాధ్యాయులను జాగ్రత్తగా ఎంపిక చేసేది. ఆధ్యాత్మిక శాంతిని సంపాదించుకోవాలన్న ప్రగాఢమైన కోరికను ఉపాధ్యాయులు సుందర్‌లో చూడగలిగారు. ఆధ్యాత్మిక శాంతిని గురించి సుందర్‌కి వచ్చే సందేహములన్నిటిని గురించి వారు ఆశ్చర్యపోతూ ఉండేవారు. తనకు జ్ఞానము వచ్చే కొలది వాటంతట అవే పోతాయని దీర్ఘ ఉపన్యాసములతో వారు ఇచ్చే జవాబు సుందర్‌కి ఎలాంటి సంతృప్తిని కలిగించ లేదు. వారి దగ్గర విద్యాభ్యాసం చేయడం వలన తన జ్ఞానం పెంపొందు చుండినప్పటికిని ఆధ్యాత్మిక శాంతి విషయంలో తన సమస్యలు పరిష్కారమై పోవడానికి బదులుగా అవి మరింతగా జటిలమై పోవుచూ, తనను మరింతగా దిగులుపరచుచున్నాయని తన గురువులతో వాదించాడు. వయసులో కొంచెము పెద్దవాడివయ్యాక, ఆధ్యాత్మిక విషయములలో మరింత అనుభవము పొందిన తరువాత ఇవన్నీ నీకు అర్థమవుతాయని వారు సుందర్‌తో చెప్పేవారు. ఒకవేళ నేను పెద్దవాడినైపోక ముందే చనిపోతే నాకు ఇక దొరకనట్లేగా అని ప్రశ్నార్థకంగా చూచేవాడు. నీవు చిన్నవాడిగానే చనిపోతే మరుజన్మలోకూడా ఇలానే ప్రయత్నిస్తే నీకు అది దొరుకుతుంది. లేదంటే ఆ తరువాత జన్మలలోనైన నీ కది దొరుకుతుంది. అయితే ఈ శాంతి కోసం నీవు వెదకుచూనే ఉండాలి. నీవు చిన్నవాడవు ఆడుకోమని పంపించివేసేవారు గురువులు. ఆ వయసు గల పిల్లలు ఇలాంటి ఆధ్యాత్మిక విషయములను గూర్చి చింతిస్తూ ఉండటము సహజముగా జరగని పని. అతడు వెళ్లి తన అన్నలతో కలసి ఆడుకోకుండా రాత్రి ప్రొద్దుపోయే వరకూ ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుకుంటూ కూర్చుంటే ఆరోగ్యము దెబ్బ తింటుందని తండ్రి చింతిస్తూ ఉండేవాడు

సుందర్ తండ్రి ఒక మంచి సిక్కుమతస్థుడు. భార్య అంటే అతనికెంతో గౌరవము. భార్య యొక్క భక్తి చిన్న వాడైన సుందర్ మీద మితిమించిన ప్రభావమును కలిగిస్తున్నాయని, భార్య భక్తి వైరాగ్యాలు హద్దులు దాటుచున్నాయనుకున్నాడు. అయితే సుందర్ దొంగిలించిన డబ్బు విషయంలో అతని మార్పు చూచి ఎంతో సంతృప్తి చెంది, భార్య ఎడల తన అభిప్రాయమును మార్చుకున్నాడు సుందర్ తండ్రి. సుందర్ తండ్రి ఒక మంచి సిక్కుమతస్థుడు. భార్య అంటే అతనికెంతో గౌరవము. భార్య యొక్క భక్తి చిన్న వాడైన సుందర్ మీద మితిమించిన ప్రభావమును కలిగిస్తున్నాయని, భార్య భక్తి వైరాగ్యాలు హద్దులు దాటుచున్నాయనుకున్నాడు. అయితే సుందర్ దొంగిలించిన డబ్బు విషయంలో అతని మార్పు చూచి ఎంతో సంతృప్తి చెంది, భార్య యెడల తన అభిప్రాయమును మార్చుకున్నాడు సుందర్ తండ్రి.

ఒకరోజు ఏదైననూ కొనుక్కోమని కొన్ని నాణేలను సుందర్ చేతిలో పెట్టాడు తండ్రి. వాటిని జేబులో వేసుకొని సంతోషంగా బజారుకు వెళ్ళుచూ చిరిగిపోయిన పలచటి బట్టలతో దారి ప్రక్కనే ముడుచుకొని పడియున్న ఓ వృద్ధురాలిని చూచాడు సుందర్. సుందర్‌ని చూచి భిక్షం అంటూ బలహీనంగా ఉన్న ఒక చెయ్యి చాచిందా ముదుసలి. ఇంతకు ముందు ఎన్నడూ ఇలాంటి దృశ్యాలను చూడని సుందర్ ఈ ముదుసలిని చూచి చలించిపోయాడు. అప్పుడు ఎంతో చలిగా ఉంది. అక్కరలో ఉన్న వారికిదయ చూపించాలని చెప్పిన తల్లి మాటలు గుర్తుకు వచ్చి తన జేబులోని డబ్బుని ఆమెకు ధర్మం చేసాడు. పరిగెత్తుకుంటూ ఇంట్లోకి వెళ్ళి, రోడ్డుపై ఒక ముసలమ్మ భిక్షమడుగుచూ ఉంది, ఒంటి నిండా బట్టలు కూడా లేవు, చలికి వణికిపోతూ ఉన్నది, కప్పుకోవడానికి దుప్పటి కూడా లేదు. ఒక దుప్పటి కొనుక్కోవడానికి ఆమెకు కొంచెము డబ్బు ఇవ్వండి అని తండ్రికి చెప్పాడు. ఆ ముసలమ్మ నాకు తెలుసు, ఎన్నోసార్లు నేను ఆమెకు సహాయము చేశాను. ఇప్పుడు మరెవరైనా ఆమెకు సహాయము చేయాలి అన్నాడు తండ్రి. వేరే ఎవరైనా ఆమెకు సహాయం చేయకుంటే ఒకవేళ ఈ చలికి చనిపోతుందేమోనని సుందర్ తన తండ్రిని ఎంత బ్రతిమాలినా లాభము లేకపోయింది. వీలుపడదు అని చెప్పి తండ్రి వెళ్ళిపోవటంతో సుందర్ నిరాశ చెందాడు కానీ ఆ వృద్ధురాలు కళ్లముందే కనబడుతూ ఉంది. ఎలాగైనా సరే ఆ వృద్ధురాలికి సహాయం చేయాలనే నిర్ణయానికి వచ్చాడు సుందర్. అదే సమయమునకు తండ్రి కోటు బెంచి మీద ఉండటం చూచి అటూ,ఇటూ చూచి ఎవ్వరూ చూడడం లేదన్న నిర్ధారణకి వచ్చిన సుందర్ కోటు జేబులో చెయ్యి వేస్తే కొద్ది నాణేలు దొరికాయి. లెక్కపెడితే అవి ఐదు రూపాయలు, సరిపోతాయి అనుకున్నాడు సుందర్. అప్పటికే ఆలస్యమైపోవడంతో రేపు కొందాములే అని అనుకున్నాడు. జేబులో నుండి డబ్బు పోవడాన్ని తండ్రి గమనించడనుకున్న సుందర్ అంచనా తారుమారు అయ్యింది. జేబులో డబ్బు చూచుకున్న తండ్రి జేబులో నుండి డబ్బు తీసుకున్నావా? అని సుందర్‌ని అడిగితే లేదు అని ఖచ్చితంగా జవాబిచ్చాడు సుందర్. సుందర్ తండ్రి మారుమాట్లాడక పోవటంతో గండం గడచిందను కున్నాడు సుందర్. ప్రశాంతంగా కూర్చున్నాడే గాని ఆ ప్రశాంతత ఎంతో సేపు ఉండలేదు. తనకో మనస్సాకి ఉందన్న విషయం అంతకు మునుపెన్నడూ అంతగా తెలియక పోయినప్పటికిని ఈ సంఘటనలో అది పూర్తిగా అర్థం కాసాగింది. ఆ రాత్రి నిద్ర పట్టలేదు. మనసులో నెమ్మది లేకుండా పోయింది. ముసలామెకు సహాయం చేయడం న్యాయమేనని సమర్థించుకొన్నప్పటికినీ దొంగిలించడాన్ని అతని మనస్సాక్షి సమర్థించలేకపోయింది. తెల్లవారక ముందే ఓ నిర్ణయమునకు వచ్చాడు సుందర్. మనస్సాక్షిని నొప్పించుకుంటూ బ్రతికే కంటే మరేం చేసినా పరవాలేదని తలంచి తండ్రి దగ్గరకు వెళ్ళి ఆ దొంగతనాన్ని ఒప్పుకొని డబ్బు తిరిగి ఇచ్చేయాలనుకున్నాడు.

( ఇంకా ఉంది )

–సేకరించబడింది.



# “ ప్రేమ ”

Hellow ! పిల్లలు బావున్నారా ? Happy New Year బాగా Enjoy చేశారా? ఈ New year ఎలా ఉండాలని plan చేసుకుంటున్నారు ? మీకు ఒక story చెబుతాను, అది చదివి plan చేసుకోండి. o.k. నా !

ఓ బాలిక ఒక ఇంటికి వెళ్ళింది. ఆ ఇంట్లో ఉన్న వ్యక్తి ఆమె చేతిలోని బైబిల్ చూచి మండిపడి బయటికి వెళ్ళు అని కోపంతో కేకలు వేశాడు. ఆ పాప మిక్కిలి వినయంగా మీరు వ్యాధితో చాలా బాధపడుతున్నారని నాకు తెలిసింది కాబట్టి మిమ్మల్ని చూసి వెళదామని వచ్చాను అని చెప్పింది. ఆ వ్యక్తి విసుగుతో ఆమెను దూషించాడు. అయిననూ ఆ బాలిక మరుసటి రోజు కూడా వెళ్ళింది. అప్పుడు ఆ అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ‘నీవు త్వరగా వెళ్ళిపో’ ఈ గది నిండా వ్యాధి క్రిములున్నాయి. ఆ వ్యాధి నీకు కూడా వస్తుంది అని చెప్పాడు. అది మరణ కరమైన క్షయవ్యాధి ఆ దినములలో ఈ వ్యాధికి మందులు కూడా లేవు. ఆ బాలిక భయపడక, స్వస్థపరిచే యేసయ్య గురించి చెప్పుచుండెను. మరుసటి దినము కూడా ఆ బాలిక ఆ ఇంటికి వచ్చెను. బహుగా విసుగుచెందిన ఆ వ్యక్తి ఆ బాలికను దూషించెను. అతని దూషణలను లక్ష్యపెట్టక ఆమె అతని ఆరోగ్యము కొరకు కన్నీటితో ప్రార్థించి, యేసుప్రభువుని నమ్ముకొనమని బ్రతిమలాడ సాగెను. అప్పుడు అతను నా వాళ్ళు అంతా నన్ను విడిచిపెట్టేసిననూ, ఈ అమ్మాయి నన్ను విడువక నా కోసము ఎందుకు ఏడుస్తుంది? అని ఆలోచించి, అతని హృదయం కరిగి ఏడ్వసాగెను. ఆ బాలిక ప్రేమతో తన బైబిలును అతనికి ఇచ్చి చదవమని కోరెను . నాకు ఇష్టము లేకపోయినా నీ కోసము చదువుతానని చెప్పి ఆ బైబిలును స్వీకరించెను. అయిష్టంగానే ఆ వ్యక్తి బైబిలు చదువుతూ ఉన్నపుడు బైబిల్ గ్రంథములోని జీవపుమాటలు అతనిలో ఉన్న అనారోగ్యమును స్వస్థపరిచెను. కొన్ని దినముల తరువాత సంపూర్ణ ఆరోగ్యము గల వ్యక్తిగా మార్పు చెందెను. తరువాత యేసుక్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చుట ప్రారంభించెను.

పిల్లలూ ! ఆ వ్యక్తి ఎవరో కాదు, ఇప్పుడు ప్రపంచములోనే ఇంచుమించుగా 8 లక్షల కంటే ఎక్కువ సంఘసభ్యులకు కాపరిగా ఉన్న పాల్‌యాంగిచోగారు. పిల్లలూ ఆశ్చర్యంగా లేదూ, ఆ బాలిక పాల్‌యాంగిచోగారి మీద చూపిన ప్రేమ, దయ, ఆయనను ప్రభావితము చేసి దేవునికి ఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దాయి. మీరు కూడా చిన్న పనులనైనా ప్రేమతో చేయుట ద్వారా పెద్దఫలితం వస్తుంది. మీ ప్రవర్తన ఇతరులకు ఇన్‌స్పిరేషన్‌గా ఉండాలని ఆశిస్తూ

– ప్రేమతో మీ అక్కయ్య

# “నా జీవితములో దేవుని మేలులు”

-వి.జోసఫ్, కుమ్మమూరు.

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి హృదయపూర్వక వందనములు. నా పేరు నాగేశ్వరరావు.మాది కృష్ణాజిల్లా, కుమ్మమూరు గ్రామము. నలుగురు అన్నయ్యలు, అమ్మా, నాన్న, నేను ఇదీ మా కుటుంబము. మా నాన్నగారు ప్రైవేటు కంపెనీలో జాబ్ చేసేవారు.వచ్చే జీతం చాలక అప్పులు చేసేవారు,కానీ తీర్చేమార్గం లేదు. అప్పులవాళ్ళు ఇంటి దగ్గరకు వచ్చి గొడవ చేసేవారు. ఆ పరిస్థితులలో నాన్న అమ్మని కొడుతూ ఉండేవారు. అప్పుడు నేను ఏడవ తరగతి చదువుచున్నాను. ఈ పరిస్థితులకు ఇల్లు విడిచి పారిపోవాలన్పించేది. నేను కుటుంబంలో చిన్నవాడిని కావడం, మా నాన్నగారు నన్ను ఎక్కువగా ప్రేమించేవారు. ఆయన బయటికి వెళ్ళినప్పుడు నన్ను కూడా తీసుకువెళ్ళేవారు. కొన్నిసార్లయితే మా స్కూల్‌కు వచ్చి టీచర్స్ అనుమతి అడిగి సినిమాలకు కూడా తీసుకువెళ్ళేవారు.కొన్ని దినములైన తరువాత నన్ను ప్రేమించే మా నాన్నగారు చనిపోయారు. ఆ సంఘటన నాకు చాలా బాధను కలిగించింది. మా ఇంట్లో ఎవరూ పూజలు చేసేవారు కారు, అలాగుననే చర్చికి కూడా వెళ్ళేవారు కాదు. కానీ అమ్మ మాత్రం తెల్లవారు జామునే లేచి ప్రార్థన చేసేది. నేను ఒకసారి నా స్నేహితునితో కలిసి చర్చికి వెళితే మా మూడవ అన్నయ్య నన్ను బాగా కొట్టాడు. నేను ఐ.టి.ఐ చదివిన తర్వాత ఉద్యోగం నిమిత్తము హైదరాబాదు రావటం, ఒక ప్రైవేట్ కంపెనీలో జాయిన్ అవటం జరిగింది.

మనస్సుకి నచ్చినట్లు ఉండటమే జీవితములో ఆనందము అనుకుని నా పదిహేనేళ్ళకే స్నేహితులతో కలిసి త్రాగటం అలవాటు చేసుకున్నాను. రోడ్ల మీద వెళ్ళే ఆడపిల్లలను విచక్షణా జ్ఞానం లేకుండా కామెంట్స్ చేస్తూ జీవించేవాడిని. అలాగే సినిమా డైరెక్టర్ అవ్వాలని ఉండేది. ఎవ్వరి మాటా వినేవాడిని కాదు. నేను చెప్పేదే కరెక్ట్ అనే మనస్తత్వంతో ఒకగురి, గమ్యం లేకుండా జీవించే వాడిని. నా రూమ్‌లో ఉండే స్నేహితుడు ఆదివారం ప్రార్థనలకు వెళ్ళేవాడు.

ఒకరోజు నేను కూడా అతనితో ప్రార్థనకు వెళ్ళాను. అది ఒక గృహంలో జరుగుతుండేది. అక్కడ ముగ్గురు మాత్రమే ఉండేవారు, కానీ వారితో సహవాసం నాకు నచ్చింది. అదే విధంగా అక్కడ దైవసేవకులు చెప్పిన వాక్యం విన్నప్పుడు ఆనందం కలిగి ప్రతీవారం వెళ్ళాలనిపించేది. క్రమక్రమంగా ఆరాధనలకు వెళ్ళటం మొదలు పెట్టాను. సేవకులంటే పొట్ట కూటి కోసం బైబిల్ పట్టుకుని తిరుగుతారని భావించిన నేను వాక్యమును బోధిస్తున్న సహోదరునికి మనుష్యులపట్ల బాధ్యత, ఆత్మల పట్ల భారమును చూచి నేను ఆశ్చర్యపోయాను.ఆయనకి దగ్గరగా ఉంటూ జీవితవిధానమును గమనిస్తూ, నా జీవితమును

చాలా మార్చుకున్నాను.నాకు కలిగిన సందేహములకు ఓపికతో సమాధానము ఇచ్చేవారు. 2000 సంవత్సరంలో పాపక్షమాపణ నిమిత్తం బాప్తీస్మం పొందటం జరిగింది, అప్పుడు నా పేరు జోసఫ్‌గా మార్చబడింది. ఆ దినం నుండి పరిచర్యను ఒక కుటుంబముగా భావించుకుని పరిచర్యలో కొనసాగుతున్నాను. నేను మా సొంత ఊరికి వెళ్ళినప్పుడు ఆ ఉండే రెండు మూడు దినములకే పరిచర్యలోని సహోదరులు జ్ఞాపకం వచ్చి క్షణం కూడా ఉండాలన్పించేది కాదు. ఇంతగా సహోదర ప్రేమలో నిలిపినందుకు దేవునికి స్తోత్రములు.

మా ఊరిలో ఉన్న అన్నల కుటుంబముల గురించి నాకు భయం కలిగి, వారు సజీవుడైన దేవున్ని ఎరిగి ప్రార్థనకు వెళ్ళాలని మరియు అమ్మ ఆరోగ్యం సరిగా ఉండాలని ప్రార్థిస్తూ ఉండేవాడిని. ఒకసారి వాక్యమును బోధించే సహోదరులు ఆరాధనలో చెప్పిన వాక్యము" ఆయనను ప్రేమించిన వారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుతాయని " నన్ను ఎంతగానో ధైర్యపరచి, నాలో భయమును పోగొట్టింది. అంత మాత్రమే కాకుండా నా వివాహము విషయంలో కూడా దేవుడు కనికరించి విశ్వాసురాలైన భార్యను అనుగ్రహించి ఒంటరిగా ఉన్న నన్ను ఒక కుటుంబముగా మార్చాడు. సంఘములో చేసిన ప్రార్థనలు దేవుడు ఆలకించి నా అన్నల కుటుంబాలను కూడా దేవునికి సమీపముగా నడిపించారు. సినిమా డైరెక్టరును కావాలన్న ఆలోచన విడిచి, దేవుడు అనుగ్రహించిన కంఠస్వరం ద్వారా ప్రభువుని స్తుతించి మహిమ పరచటం నేర్చుకున్నాను.

అంతేకాకుండా నా యౌవన కాలంలో విచక్షణను కోల్పోయి, వివేచన లేకుండా బ్రతుకుతున్న నన్ను దేవుడు మార్చి, దేవునికి ఉపయోగపడే పాత్రగా మలిచి, నాకీ విలువైన జీవితమును అనుగ్రహించిన దేవునికి కృతజ్ఞుడనై ఉంటాను. ఆమెన్ !


చందా వివరములు

**సంవత్సర చందా : రూ. 50/-లు.**

**జీవితకాల చందా : రూ. 1000/-లు.**

**విదేశములకు : సంవత్సరమునకు US $ 20.**

పంపవలసిన మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070



# అపోహలు

అపోహ అనగా లేని దానిని ఊహించుకొనుట. అపోహ అనునది మన జీవితములలో మనుష్యులతోను, దేవునితోను సమాధానము లేకుండా చేస్తుంది. అపోహలు ఒకరి ఎడల ఒకరికి శత్రుత్వమును కలుగచేస్తాయి.

దేవుడు మనిషిని సృజించినపుడు అపోహ అనేది ఉండేది కాదు. ప్రతి దినము ఆదాము, అవ్వలతో మాట్లాడుతూ ప్రేమ, అనురాగములతో ఉండేవారు. నేడు అనేక కుటుంబములలో భార్య, భర్త మీద, భర్త, భార్య మీద అపోహలను కలిగి ఉండుట వలన నమ్మకత్వము లేక, పరస్పర అవగాహన కోల్పోయి, చూడటానికి కలిసే జీవిస్తున్ననూ, హృదయములలో వ్యతిరేక భావములు కలిగి ఉంటున్నారు. అదే విధంగా తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్‌ను మంచిగా తీర్చి దిద్దాలనే ఆశతో మందలించినప్పుడు, పిల్లలైన వారు నన్ను ప్రేమించట్లేదనే అపోహతో కొన్నిసార్లు బలవంతపు మరణములను కొని తెచ్చుకుంటున్నారు. మరి కొన్ని సార్లు తల్లిదండ్రులకు అవిధేయులుగా జీవిస్తున్నారు. మనము అపోహలతో సమాజమును చూస్తే, మంచి చెడుగా, ప్రేమ స్వార్థముగా, యథార్థత మోసముగా కనపడుతుంది. దీనిని బట్టి దేవుని దృష్టిలో అపరాధులుగా మార్చబడతాము. అదే విధముగా ఆత్మీయ జీవితములో వాక్యమును వింటూ ఉన్నప్పుడూ, చదువుతూ ఉన్నప్పుడు ఇది నిజముగా జరిగిందేనా? మన జీవితములో కూడా జరుగుతుందా? అనే అపోహలు లేకుండా జీవించాలి. అపోహలను సాతాను కలిగిస్తాడని గ్రహించుకోవాలి.


సృష్టిలో మొట్టమొదటి కుటుంబ మైన ఆదాము, అవ్వల జీవితములో దేవుడు చెప్పిన మాటలను గూర్చి సాతాను అవ్వతో ఇది నిజమా ? అనే అపోహను కలిగించి, వారు ఆజ్ఞను అతిక్రమించేలా చేసి, దేవుని దృష్టికి దోషులుగా మారేలా ప్రేరేపించాడు. తద్వారా దేవుని ప్రేమ నుండి వారు దూరపరచబడ్డారు. అపోహ కలిగినప్పుడు అన్నిటినీ అనుమానించి హృదయమును కఠినముగా మార్చుకొనుట జరుగుతుంది. హృదయమును కఠినపరుచు కొనువాడు కీడులో పడును అని సామెతలు 28:14 లో వ్రాయబడింది. కాబట్టి మనము అర్థంలేని అపోహలతో సమయమును తద్వారా జీవితమును వ్యర్థము చేసుకుని సాతాను చేతికి చిక్కక, మంచి ఆలోచనలతో జీవిత విధానమును మార్చుకుంటూ ఉండుట వలన దేవుని చేతిలో సురక్షితముగా జీవించెదము.

**- ఎడిటర్.**




# ఇది తెలుసా?

జాంబియా అనే దేశం ఆఫ్రికా ఖండంలో ఉంది. ఈ దేశం ప్రపంచంలో ఒక గుర్తింపును కలిగి ఉంది. ఆ గుర్తింపు ఏమనగా జనాభాలో ఎక్కువ భాగము దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.అనగా ఈ దేశంలో ఉన్న ప్రజలలో ఎక్కువ భాగం బీదలు.










- ఈ దేశ జనాభా 1,15,00,000.
- దారిద్ర్యరేఖకు దిగువన ప్రతీ 100 మందిలో 86 మంది ఉన్నారు.
- లుసాకా అనే పట్టణం ఈ దేశ రాజధాని నగరము.
- లుసాకా అనే పట్టణంలోనే సుమారుగా 6,00,000 అనాథలు ఉన్నారని అంచనా.
- ఇంతమంది అనాథలుగా మారడానికి మరణకరమైన వ్యాధులే కారణం.
- ప్రతీ 100 మందిలో 17 మంది హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి బాధితులే.
- మలేరియా వ్యాధితో బాధపడుతూ వైద్యం అందక మరణించే వారు మరి కొంతమంది.
- సంపాదించవలసిన పెద్దలలో అనేకులు వ్యాధిగ్రస్తులు అవటం వలన, పిల్లలు బాలకార్మికులు అవుతున్నారు.
- చిన్న పిల్లలు ఎక్కువ శాతం మంది స్కూలుకి కూడా వెళ్ళలేకపోతున్నారు. కారణం వారి యొక్క కరువు, దరిద్రత. ఇచ్చటి ప్రజలు చాలీచాలని ఆహారంతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు.
- ఎక్కువ శాతం ప్రజల దినసరి ఆదాయం 50 రూపాయల కంటే తక్కువే.
- లకనీస ప్రాథమిక వైద్య సదుపాయములు లేక ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు
- ఇన్ని సమస్యలతో సతమతమవుతున్న దేశం కొరకు మనం భారంతో ప్రార్థిద్దాం !




# బైబిల్ క్విజ్ -2

1. గాతు వాడైన గొల్యాతు సోదరుడు ఎవరు ?
2. యూదులలో ప్రసిద్ధి కెక్కిన ఒక ధర్మశాస్త్రోపదేశకుడు అయిన పౌలు ఎవరి పాదముల యొద్ద పెరిగాడు ?
3. జనులలో హతమైన వారిని గూర్చి తల జలమయముగాను, కన్ను కన్నీళ్ళ ఊటగాను దివారాత్రులు కన్నీరు విడిచిన ప్రవక్త ఎవరు ?
4. నా మనవి వినుటకై నాకొకడు ఉండవలెనని నేనెంతో కోరుచున్నాను అని ఎవరు అనెను ?
5. స్త్రీలు చూపు ప్రేమ కంటే అధికమైన ప్రేమ చూపిన వాడు ఎవరు ?
6. పసుల కాపరియై, మేడి పండ్లు ఏరుకొనుచుండగా యెహోవా పిలిచిన ప్రవక్త ఎవరు?
7. బెన్యామీనీయులు కాక ఇశ్రాయేలీయులలో ఖడ్గము దూయగలవారు ఎంత మంది ?
8. నా సహోదరుల నిమిత్తము నా సహవాసుల నిమిత్తమును నీకు క్షేమము కలుగును గాక అని నేనందును. రిఫరెన్సు ఏమిటి?
9. భర్త ప్రార్థన చేయగా యెహోవా ఆలకించి గొడ్రాలు అయిన భార్య గర్భము తెరిచెను ఆమె ఎవరు ?
10. నేను బాలుడను, మాటలాడుటకు నాకు శక్తి చాలదు అని ఏ ప్రవక్త అన్నారు ?

ఈ ప్రశ్నలకి సరైన రిఫరెన్సులతో సమాధానాలు జనవరి 30వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానాలు వ్రాసిన వారి పేర్లు మార్చి పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా: ఎడిటర్ – స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–500070

---

**బైబిల్ క్విజ్–1 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు:**

1. సూసన్న(విశాఖపట్నం) 2. సి.హెచ్.ఇందిర(అంతర్వేదిపాలెం) 3. కె.హెచ్.ప్రియదర్శిని(హైదరాబాదు)

**బైబిల్ క్విజ్–1 జవాబులు**

1. షూనేమీయురాలైన స్త్రీ, ఎలీషా ప్రవక్త (2రాజులు–4:9), 2.దెబోరా(న్యాయాధి–4:5) 3.మరియ(లూకా–1:46), 4.హన్నా(1సమూ1:15), 5.రిబ్కా(ఆది–25:24), 6.యాయేలు (న్యాయాధి–5:24), 7.అన్న(లూకా–2:36), 8.పిలాతు భార్య(మత్తయి–27:19) 9. 39 పుస్తకములు, 10. అపొస్తలుడైన పౌలు

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2009 ప్రత్యేక ప్రార్ధనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | శని | 9.00 | భాగ్యలత |
| ఫిబ్రవరి | 1 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మార్చి | 27 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| ఏప్రియల్ | 10 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మే | 1 | శుక్ర | 9.00 | భాగ్యలత |
| జూన్ | 07 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| జులై | 05 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| ఆగష్టు | 15 | శని | 9.00 | భాగ్యలత |
| సెప్టెంబర్ | 28 | బుధ | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| అక్టోబర్ | 2 | శుక్ర | 9.00 | భాగ్యలత |
| నవంబర్ | 01 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| డిసెంబర్ | 06 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |

**యౌవనస్థుల కూడికలు:-**
ప్రతి నెల 2వ బుధవారం చింతల్
ప్రతి నెల 3వ బుధవారం భాగ్యలత
సాయంత్రం గం. 7.00 లకు

**స్త్రీల కూడికలు:-**
ప్రతి నెల 1వ బుధవారం భాగ్యలత
ప్రతి నెల 2వ బుధవారం అనాజ్‌పూర్
ప్రతి నెల 3వ బుధవారం చింతల్
సాయంత్రం గం. 7.00 లకు

**సేవకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం సాయంత్రం గం. 7.30 ని.లకు

**"పర్వతములు తొలగిపోయినను, మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు"**

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక. ఈ పత్రిక ద్వారా జన్మదిన మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు..

**"నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితములమీద ఉండును గాక! "**

## జనవరి - ఫిబ్రవరి

**భాగ్యలత:** ఛైత్రిక, హరికుమార్, సులోచనారాణి, రంగా, మణి, రమాదేవి, కుమారి, కార్తీక్‌కృష్ణ, పాల్‌ప్రవీణ్, దీవెన, నిర్మల, తిరుమల, హైమావతి, రాజ్‌కుమార్, సజీవ్, కృపాలత, సత్య, రాజేష్, రగూయేల్, మంజుల, జోసెఫ్, పూజిత, తిమోతి, నిహారిక, తులసి, జ్యోత్స్న, జోసెఫ్, కరుణాకర్, రాజు, శ్రీనివాస్, సునీత, చల్లారావు, మనోహర్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఆనందరావు, కొర్నేలి, మేరీసౌజన్య.

**చింతల్:** కొర్నేలి, ప్రకాష్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు,రాహుల్, జ్యోతిర్మయి, పుష్పలత, జెర్రీరోజ్‌రాయ్, ఉదయ్, జె.యస్.ఎన్.మూర్తి, పవన్ చందు, రిబ్కా, దానియేల్, హెప్సిబా,అమర్, పద్మజారాణి, రాజు, సువర్ణరాజు, మహిమజ్యోతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి

**అనాజ్‌పూర్:** విజయమ్మ, వైకుంఠరావు, హానోకు, అంకమ్మ, సువమ్మ, సునీత, కీర్తి, మారియ, అమర్‌నాథ్, జాన్‌బీ.

**ఇ.సి.ఐ.ఎల్:** జీవా, సజీవ్

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

# ఎఫ్రాతా మినిస్ట్రీస్

# స్పర్శ

## ఆధ్యాత్మిక ద్వైమాసపత్రిక ప్రారంభోత్సవము

## ది. 9.11.2008 తేదిన జరిగినది.



ది. 25.12.2008 తేదిన క్రిస్మస్ సందర్భముగా
వేలాది మందికి సువార్తను ప్రకటించుట జరిగినది. వీరిలో కొందరు
నూతనమైన తీర్మానాలతో క్రీస్తు కొరకు జీవించుటకు నిర్ణయించుకున్నారు.
వీరి తీర్మానాలను దేవుడు స్థిరపరచును గాక!



# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలనీ ,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com